క్లుప్తంగా

రామయ్య విగ్రహ ప్రతిష్టకు ఆహ్వానం



సిన్హాకు అక్షింతలు, ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బీజేపీ నాయకులు

పరవాడ: అయోధ్యలో ఈ నెల 22న వైభవంగా నిర్వహించనున్న రాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హాను బుధవారం బీజేపీ నాయకులు ఆహ్వానించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుడు జగదీష్ తదితరులు అక్షింతలతో పాటు ఆహ్వాన పత్రం అందజేశారు.

సొసైటీలో డివిడెండ్ల పంపిణీ



డివిడెంట్ నగదు, క్యాలెండర్ అందజేస్తున్న కర్రి అప్పలస్వామి

సింహాచలం: అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో బుధవారం నుంచి డివిడెండ్ల పంపిణీని సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి ప్రారంభించారు. పలువురు సంఘ సభ్యులకు షేర్‌ధనంపై 20 శాతం వడ్డీ, త్రిప్టుపై 8 శాతం వడ్డీ అందజేశారు. ఈనెల 20వరకు డివిడెండ్ల పంపిణీ జరుగుతుందని అప్పలస్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, డైరెక్టర్లు కొలుసు గురునాథ్, బోర ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజు శ్రమదానం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెందుర్తి: జాతీయ సేవా పథకంలో భాగంగా గోపాలపట్నం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు లక్ష్మీపురం,పోర్టు కాలనీ ప్రాంతాల్లో రెండో రోజు బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో చెత్తను శుభ్రం చేసి పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ అధికారి సి.హెచ్. ఆదిబాబు పాల్గొన్నారు.

పేదలకు చేరువగా పథకాలు

పరవాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు కోరారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడానికే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అని చెప్పారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భవ కార్డులు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమశేఖర్, రామకృష్ణ, అధికారులు గండి రామారావు, ఎం.ఎస్.ఎన్.రెడ్డి, ఏఈవో సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

అల్లిపురం: రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవం బుధవారం సూర్యాబాగ్ పోలీస్ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఏసీపీ మోహన్‌కుమార్ పాల్గొని అసోసియేషన్‌లో రిటైరై పదిహేను సంవత్సరాలైన రిటైర్డ్ డీఎస్పీ సీహెచ్.అప్పలనరసమ్మ, ఏఎస్ఐ బి.సత్యారావు, ఎస్ఐ ఎస్.సంజీవరావు, ఆర్ఎస్ఐ ఎం.మోహన్‌రావు, ఎస్ఐ ఎస్‌వీ రమణ, ఎస్ఐ ఎస్.సత్యనారాయణను ఆయన సత్కరించారు. అనంతరం కార్ ఏసీపీ మోహన్‌కుమార్ మాట్లాడుతూ రిటైర్‌మెంట్ అనేది ఉద్యోగానికి మాత్రమేనని మనసుకు కాదన్నారు. చక్కగా సమయానికి భోజనం చేస్తూ తగిన వ్యాయామం చేస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోలీసు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

- మండలస్థాయి పోటీలు ప్రారంభం
- 23 వరకు కొనసాగనున్న పోటీలు

ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు.



నారపాడు-మొగలిపురం జట్ల మధ్య రసవత్తరంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

సబ్బవరం: స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే జరుగుతుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక ప్రతిభా విద్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ గ్రామీణ యువతలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు.విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు,ఎంపీడీవో రమేష్ నాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీటీసీ బైలపూడి దేముడు బాబు,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు,



మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు



క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేస్తున్న నిర్వాహకులు

పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, నాయకులు బోను గంగునాయుడు,బోకం స్వామినాయుడు,దనిమిరెడ్డి శ్రీనివాసరావు,నేబర్తి శ్రీను,రాజు,ఈవోఆర్‌డీ మహేష్, ఏవో ఎస్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

5,473 మంది రిజిస్ట్రేషన్

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి మండలంలోని అన్ని సచివాలయాల నుంచి 5,473 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారిలో స్త్రీలు 2076 మంది, పురుషులు 3397 మంది ఉన్నారు. ఆయా క్రీడాంశాలకు సంబంధించి పురుషులు 399 టీమ్‌లు, స్త్రీలు 229 టీమ్‌లుగా ఏర్పడ్డాయి.

23 వరకు మండల స్థాయి పోటీలు

మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలు ఈ నెల 10 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. మండలంలోని 20 సచివాలయాలకు గాను ఒక్కో సచివాలయం నుంచి ఒక్కో క్రీడాంశానికి సంబంధించి ఒక టీమ్ చొప్పున 5 పురుషుల జట్లు, 5 స్త్రీల టీమ్‌లు కలిసి 10 జట్లు మండల స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఒక్కో సచివాలయం నుంచి 114 మంది క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.



ఉత్సాహంగా సాగుతున్న వాలీబాల్

వేదికలు ఇవే

వాలీబాల్,కబడ్డీ,ఖోఖో పోటీలు సబ్బవరం ప్రతిభా విద్యాలయం వేదికగా.. సబ్బవరం గురుకుల పాఠశాలలో బ్యాడ్మింటన్ పోటీలు, మదర్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో క్రికెట్ పోటీలు నిర్వహించారు.

సెమీస్‌కు అర్హత సాధించాం



కబడ్డీ పోటీల్లో సచివాలయ స్థాయిలో విజేతగా నిలిచి మండల స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. స్టీల్ ప్లాంట్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాను. మండల స్థాయిలో వంగలి సచివాలయ టీమ్‌తో ఆడి విజేతగా నిలవడంతో సెమీస్‌కు అర్హత సాధించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహించడంతో నాకు ఈ అవకాశం దక్కింది.

– సిలారపు చరిష్మ, అసకపల్లి

క్రీడాకారులకు ప్రోత్సాహం



నాకు కబడ్డీ, ఖోఖో అంటే ఎంతో ఆసక్తి. వివాహం అయినప్పటికీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. సచివాలయం స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచి మండల స్థాయి పోటీలకు ఎంపికయ్యాం.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతో అభినందనీయం.

– అదపా శివలక్ష్మి, అసకపల్లి

సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ భేటీ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. దీనిపై సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తెలిపారు.

12న ప్రత్యేక పూజలు

పరవాడ: ఫార్మాసిటీ కాలనీలో కొండపై కొలువుదీరిన శ్రీ భూసమేత అభయ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రతంలో భాగంగా ఈ నెల 12న ఉదయం 6 గంటలకు గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 10 గంటలకు అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తామని పేర్కొన్నారు. అలాగే 14న శ్రీగోదాదేవి, శ్రీ రంగనాథస్వామికి కల్యాణం (గోదా కల్యాణం) వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

బాలికా సాధికారతే ఎన్టీపీసీ లక్ష్యం

ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా



బాలికలతో ప్రాజెక్టు హెడ్ సిన్హా, ఉన్నతాధికారులు



బాలికలకు యోగా కిట్లు అందజేస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: బాలిక సాధికారతే లక్ష్యంగా సింహాద్రి ఎన్టీపీసీ కృషి చేస్తుందని సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా చెప్పారు. దీపాంజలినగర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బాలికా సాధికారత మిషన్ వర్క్‌షాపును బుధవారం ప్రాజెక్టు హెడ్ సిన్హా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలు, యువతను నాయకులుగా తయారు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. తొలుత మండలంలోని 13 పాఠశాలలకు చెందిన 110 విద్యార్థులతో మిషన్ ప్రారంభమైందన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడి నేతృత్వంలో బాలికలకు స్వీయ విలువ, విశ్వాసంపై అవగాహన కల్పించడం జరిగిందని చెప్పారు. ఆధునిక ప్రపంచంలో సవాళ్లను ఎదుర్కొనే విధంగా బాలికలకు నైపుణ్యం కల్పించడమే సంస్థ లక్ష్యమని చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న బాలికలకు యోగా మ్యాట్‌లు, స్టేషనరీ వస్తువులతో కూడిన కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జీఎం నోవాహు గడ్డం, హెచ్‌ఆర్ హెడ్ బీబీపాత్ర, బాల భారతి పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ బి.పద్మజ, హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, సీఎస్సార్ హెచ్‌ఆర్ శివప్రతాప్‌సింగ్, దీపిక లేడీస్ క్లబ్ సభ్యులు, బాలికలు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వెంకటాద్రికి పోటెత్తిన భక్తులు



వెంకన్నకు పూజలు చేస్తున్న అర్చకుడు, స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రికి బుధవారం భక్తులు పోటెత్తారు. ఇక్కడ కొలువదీరిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే బారులు తీరారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష పూజలు జరిపారు. తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామి, గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్న అన్న ప్రసాద పథకానికి విరాళాలు



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. సింహాచలంకి చెందిన నందూరి శ్రీహర్ష రూ. లక్ష చెక్‌ను ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు, అలాగే మాధవదార ప్రాంతానికి చెందిన వి.శ్రీరామ్,జయలక్ష్మి దంపతులు రూ. లక్ష విరాళం అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు. దాతలకు దేవస్థానం తరఫున బాండ్లు అందజేయడంతో పాటు స్వామి దర్శనం కల్పించారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 46వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. మురళీధర్ మాట్లాడుతూ కళాశాల 1977వ సంవత్సరంలో ఏర్పాటు అయిందన్నారు. జనరల్ కోర్సులు–4, మూడు ఒకేషనల్ కోర్సులతో ప్రారంభమై నేడు నేడు ఒకేషనల్ 9 కోర్సులు, జనరల్ కోర్సులు–4 తో మొత్తం 13 కోర్సులతో విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్య అందిస్తుందన్నారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

నేటితో ముగియనున్న మార్గశిర మాసోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, ఆంధ్రుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు దర్శనాలు నిలిపివేయనున్నారు.

29వ రోజు పూజలు

మార్గశిర మాసోత్సవాలు సందర్భంగా బుధవారం 29వ రోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించా రు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ చేశారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొని తరించారు. త్రికాల పంచామృతాభికు గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి.

యువతకు స్ఫూర్తి.. వివేకానంద



విద్యార్థినికి పుస్తకాన్ని అందిస్తున్న స్వామి స్వసంవేద్యానంద మహారాజ్

మురళీనగర్: నేటి యువత, విద్యార్థులు స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని భారతీయ ఆధ్యాత్మిక, సంప్రదాయాలను కాపాడాలని విశాఖపట్నం రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి స్వసంవేద్యానంద మహరాజ్ పిలుపునిచ్చారు. రామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవం సందర్భంగా యువజాగృతిలో భాగంగా రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సాంస్కృతిక, సాహిత్య పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఆదినారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెటలర్జికల్ ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగాలకు చెందిన 69 విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి ఐదుగురు విజేతలకు స్వామి స్వసంవేద్యానంద మహరాజ్ బహుమతులను, విద్యార్థులకు స్వామి వివేకానంద బోధనల పుస్తకాలను అందించారు. కాలేజీ వివిధ శాఖాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో స్వామి వివేకానంద జయంత్యుత్సవాల సందర్భంగా రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో జాగృతి సాంస్కృతిక పోటీలు నిర్వహించారు.

'కార్మికుల సమస్యలు పట్టని ఉక్కు యాజమాన్యం'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని స్టీల్ సిటూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ విమర్శించారు. కార్మికుల డిమాండ్లపై యూనియన్ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు పోటీదారుగా ఉన్న జిందాల్‌తో ఒప్పందం చేసుకోవడం వల్ల స్టీల్‌ప్లాంట్ ప్రతిష్టకు భంగం కలుగుతుందన్నారు. ఈ అంశంపై కలుగుతున్న అనుమానాలను నివృత్తి చేయకుండా పెంచే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేసి సెయిల్‌తో ఒప్పందం చేసుకోవాలన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ఉక్కు కార్మికులకు ఎన్‌జేసీఎస్ ఒప్పందంలో ఉన్న క్లాజులను తొలగించి వేతన సవరణ చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వై.టి.దాస్, మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, సురేష్‌బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో 'ఉక్కు' పరిరక్షణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఐక్య పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికుల పోరాటానికి ఎదురులేదని, ప్రభుత్వరంగ సంస్థల విషయంలో కేంద్రప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1063వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోరాడటం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.